క్లుప్తంగా

ఆడబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


చిన్నారుల తల్లిదండ్రులతో నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ఆడబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గురువారం బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మంత్రి కేటీఆర్ గిఫ్ట్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా 50మంది ఆడబిడ్డలు జన్మనిచ్చిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ గత సంవత్సరం మంత్రి హరీశ్‌రావు జన్మదినం పురస్కరించుకొని జూన్ 2వ తేదీన 22 మంది ఆడబిడ్డలకు జన్మనిచ్చిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున అందజేశామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు హెల్త్ ఆఫీసర్ గోపినాయుడు, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, వార్డుసభ్యులు, ఏఎన్‌ఎంలు, ఎస్‌ఎమ్ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం


నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

జహీరాబాద్: నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని వేద ఐటీఐ కళాశాలలో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ ఆండ్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉచిత నైపుణ్య శిక్షణ పొందిన 30 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వికాస్ సంస్థ చైర్మన్ లక్ష్మారెడ్డి, డాక్టర్ సురేష్‌కుల్‌కర్ణి, జీవన్‌రావు, విట్టల్, రాజారెడ్డి, సంతోష్‌కుమార్, సిద్దిఖ్, ప్రిన్సిపాల్ ఇర్ఫాన్, సురేందర్‌రెడ్డి, సంగారెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడాకారులను ప్రోత్సహించాలని రాష్ట్ర కార్మిక నాయకులు, అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య అన్నారు. గురువారం రాత్రి తెల్లాపూర్‌లో అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ, స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్‌కుమార్ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా గ్రామస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పావని, బాలజీ, మంజుల, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తూర్పు శ్రీనివాస్, తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు రవీందర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలి


నాయబ్ తహసీల్దార్ దినేష్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని కాశీపూర్‌లోని సర్వేనంబర్ 114లో గల స్థలాన్ని అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం కేటాయించాలని ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు పెద్ద గీత మాదిగ డిమాండ్ చేశారు. గురువారం నాయబ్ తహసీల్దార్ దినేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాశీపూర్‌లో లింగాయత్ భవన్ కోసం ప్రభుత్వభూమిని అధికారులు కేటాయించడం అన్యాయమన్నారు. ఈ విషయమై గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. అందరికి ఆమోదయోగ్యమైన అంబేడ్కర్ భవనంకోసం ఈ స్థలాన్ని కేటాయించాలన్నారు. బుచ్చేంద్ర మాదిగ,నాగరాజు, శ్రీశైలం, అజీజ్, నిజాం, నవాబ్, యాదగిరి, నరేష్, అనిల్, గోపాల్, జహంగీర్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఇక్కట్లు

- మొక్కజొన్న, మామిడి, వరి పంటలకు అపార నష్టం
- అయోమయంలో రైతులు


జహీరాబాద్ : నేలరాలిన మామిడికాయలు

జహీరాబాద్: గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో మొక్కజొన్న, సోయాబీన్, కూరగాయల పంటలతో పాటు మామిడి, వరి తదితర పంటలకు అపార నష్టం వాటిల్లింది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

నాగల్‌గిద్ద మండలంలో..

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలంలో భారీవర్షం కురిసింది. దీంతో మామిడి, మొక్కజొన్న, వరి, కూరగాయపంటలు దెబ్బతిన్నాయి. తెలంగాణ, కర్నాటక సరిహద్దు ప్రాంతమైన నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి, బీదర్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన చిల్లర్గి, చిమ్‌కోడ్‌లో వాగుల్లోకి వర్షం నీరు చేరింది.

జహీరాబాద్‌లో వడగండ్ల వాన

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలో కురిసిన వడగండ్ల వర్షంతో జహీరాబాద్, మొగుడంపల్లి ధనసిరి, తదితర గ్రామాల్లో గులకరాళ్ల సైజులో వడగండ్లు పడ్డాయి. భారీ వర్షం కారణంగా మామిడి, వరి, తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి, హౌసింగ్‌బోర్డు, బాగారెడ్డిపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు పేరుకపోవడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

ఝరాసంగం మండలంలో..

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో పలుచోట్ల కురిసిన వడగండ్లతో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆరబోసిన మొక్కజొన్న పంట తడిసిపోయింది. మామిడికాయలు నేలరాలాయి.


జహీరాబాద్ టౌన్: విరిగిపడిన కరెంట్ స్తంభం

బోరంచ నల్లపోచమ్మ జాతర ప్రారంభం

భారీగా తరలి వచ్చిన భక్తులు

మనూరు(నారాయణఖేడ్): బోరంచ నల్లపోచమ్మ జాతర గురువారం ప్రారంభమైంది. తొలిరోజు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, సర్పంచ్ రేణుక పండరి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాములు అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం ధ్వజారోహణం, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన జరిగాయి. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, గుడి ఆవరణలో ఎండ నుంచి ఉపశమనం కోసం ప్రత్యేక సత్రాలు ఏర్పాటు చేశామన్నారు. జాతర ఏడు వారాలపాటు కొనసాగుతుందన్నారు.


క్యూలో నిలుచున్న భక్తులు

కొనసాగుతున్న ఐకేపీ వీఓఏల సమ్మె


సంగారెడ్డి మున్సిపాలిటీ: నిరసనలో మాట్లాడుతున్న కృష్ణ


జోగిపేట: మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న ఐకేపీ వీఓఏలు

నారాయణఖేడ్: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం వీఓఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): నిరవధిక సమ్మెలో భాగంగా ఐకేపీ వీఓఏలు జోగిపేటలో మోకాళ్లపై నిరసన నిరసన తెలిపారు. సమ్మెకు డీసీసీబీ ఉద్యోగులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లన్న, జిల్లా నాయకులు లక్ష్మారెడ్డి వీఓఏలు పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): వీఓఏలను కనీస వేతనం రూ.26వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు చంద్రన్న డిమాండ్ చేశారు. ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు పద్మారాణి, ఐకేపీ వీఓఏలు పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ : వీఓఏలను ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు. సంగారెడ్డి పట్టణంలోని వెలుగు కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్టిగాళ్ల మోహన్, తెలంగాణ సోషల్ ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

హత్నూర (సంగారెడ్డి): వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారంతో 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీఓఏల నాయకులు కిష్టయ్య, లక్ష్మయ్య, నాయకులు మల్లేశం, కృష్ణయ్య, అనిత పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి


జిన్నారం: కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు కంటిపరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్, వైస్ ఎంపీపీ మంజుల, ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

జోగిపేట(అందోల్): కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు అన్నారు. గురువారం జోగిపేటలోని స్థానిక వార్డులో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి కంటిఅద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోగిపేట వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): కంటివెలుగు కార్యమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 25వ వార్డు కౌన్సిలర్ కోవూరి ప్రసన్నశంకర్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని 25వ వార్డులో కంటివెలుగు కార్యకమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కబ్జాకు పాల్పడలేదు

- మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్

సదాశివపట(సంగారెడ్డి): తాను ప్రభుత్వ భూమిని కబ్జా చేయలేదని నిబంధనల మేరకు ప్రభుత్వ జీఓ ప్రకారమే క్రమబద్ధీకరీణకు దరఖాస్తు చేసుకున్నానని మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ స్పష్టం చేశారు. గురువారం సదాశివపేట పట్టణంలోని బసవ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1997లో తనకు సదాశివపేట మున్సిపల్ కౌన్సిల్ ప్రభుత్వ భూమి కేటాయించిందన్నారు. కానీ కొందరు కావాలని రాజకీయ దురుద్దేశంతో తాను కబ్జాకు పాల్పడట్టు అనవసరంగా ప్రచారం చేస్తున్నారన్నారని వాపోయారు. తనపై ఆరోపణలు చేసేవారు తీరు మార్చుకోకపోతే పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్: సంగారెడ్డిలో ఈనెల 29న బసవభవన నిర్మాణానికి భూమిపూజను నిర్వహించనున్న సందర్భంగా నారాయణఖేడ్‌లోని బసవమంటపంలో గురువారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లింగాయత్‌సమాజ్ బాధ్యులు నాగ్‌శెట్టి, జగదీశ్వర్, శంకర్‌రావుపాటిల్, తోట వెంకటేశం, రవీందర్ షెట్కార్, సంగ్‌శెట్టి, విశ్వనాథ్, అడివప్ప పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లింగాయత్ సమాజ్ సంఘం బాధ్యులు

పార్కు స్థలాన్ని కాపాడాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కంది(సంగారెడ్డి): పార్కు స్థలం ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు జైపాల్, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇంద్రకరణ్ గ్రామపంచాయతీ ఈఓ వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంద్రకరణ్ గ్రామ పంచాయతీ పరిధిలో 2001లో ఏర్పాటు చేసిన జీపీ వెంచర్‌లో పార్కుకు ప్రభుత్వం ఎకరా ఎనిమిది గుంటల స్థలం కేటాయించిందన్నారు. ఈవెంచర్‌లోని ప్లాట్లను విక్రయించిన యాజమాన్యం ఇటీవల పార్కు స్థలాన్ని అక్రమంగా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిందని ఆరోపించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పార్కు స్థలాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్, కంతి నర్సింహులు, రమేష్, పట్నం శ్రీనివాస్, మల్లేషం, దయాకర్ రెడ్డి, వెంకటేష్, నరేష్ కుమార్, జైపాల్, మాణిక్ రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

స్వస్థత సభలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: పట్టణ శివారులోని అనురాధ కళాశాల గ్రౌండ్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన సువార్త స్వస్థత ఉజీవసభలో ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, చెన్‌బసప్ప, జైపాల్‌రెడ్డి, బాసిత్, సామేల్ పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ ఉత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామంలో గురువారం భగీరథ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొరన్నారు.

నారాయణఖేడ్: గురువారం సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సగర సంఘం ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు నారాయణ సాగర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ సగర, ఖేడ్ నియోజకవర్గంలోని మండలాల బాధ్యులు పండరి, బాల్‌రాజ్, శ్రీనివాస్, రాజు, గోపాల్, రవి, ఆనంద్, శ్రీకాంత్, నర్సింహులు, సతీష్, వెంకట్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ఖలీల్‌పూర్ గ్రామంలో గురువారం సగరుల (ఉప్పర) కుల గురువు భగీరథ మహార్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తా వద్ద భగీరథ మహార్షి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సగరుల సంఘం నాయకులు విజయ్‌కుమార్, అశోక్, నర్సింహులు రాజు, తుక్కన్న, జనార్ధన్ పాల్గొన్నారు.


జిన్నారం: ఉత్సవాల్లో సర్పంచ్, నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం**



జిన్నారం(పటాన్‌చెరు): జీఎంఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుమారుడు, బీఆర్‌ఎస్ నేత విక్రంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విక్రంరెడ్డి మాట్లాడుతూ జిన్నారంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తన సొంత నిధులతో మినీ స్టేడియంను నిర్మించేవిధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. 50టీంలు పాల్గొనే ఈ టోర్నమెంట్‌ను పదిరోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, ఉపసర్పంచ్ సంజీవ పాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి**

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పరిశీలించారు.కార్యక్రమంలో ఆయా కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్థికసాయం అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొంతపల్లి గ్రామానికి చెందిన శివరావులు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించి నగదును జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, స్థానిక నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

వివాహానికి..

జిన్నారం మండలంలోని ఊట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దాదిగూడెం గ్రామానికి చెందిన భాగ్యమ్మ, బిక్షపతిల కుమార్తె వివాహానికి వైస్‌ఎంపీపీ గంగు రమేశ్ రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

◆ **సమస్యలను పరిష్కరిస్తాం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని జ్యోతినగర్ కాలనీ, అశోక్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ పుష్పనగేష్, జీహెచ్‌ఎంజీ ఉప కమిషనర్ బాలయ్య అన్నారు. గురువారం జ్యోతినగర్ కాలనీలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అశోక్‌నగర్, జ్యోతినగర్ మధ్యలో ఉన్న ఓపెన్‌డ్రైన్, తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించగా స్పందించిన కార్పొరేటర్ కాలనీలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. కాలనీవాసులు యాదయ్య, ప్రమోద్‌గౌడ్, శేషారెడ్డి పాల్గొన్నారు.

◆ **బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి**

జహీరాబాద్: బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరారెడ్డి అన్నారు. గురువారం మొగుడంపల్లి మండలకేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ భూ స్వశక్తి అభియాన్ బూత్ కమిటీలు వేయడంతో పాటు అన్ని మోర్చాల మండల కమిటీలు వేయాలని సూచించారు. నియోజకవర్గం కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శి జగన్నాథ్, మండల పదాధికారులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

◆ **ఇంగ్లీష్ భాషపై భయాన్ని వీడాలి**

జహీరాబాద్ టౌన్: విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై ఉన్న భయాన్ని వీడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముహమ్మద్ అస్లామ్ ఫారూఖీ పేర్కొన్నారు. కళాశాలలో గురువారం 'నాకు ఇష్టమైన భారత ఇంగ్లీష్ రచయిత' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. అనంతరం పరిశోధనా పత్రాలను సమర్పించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్లు రవీందర్‌రెడ్డి, మహ్మద్ గౌస్, నరహరిమూర్తి, విద్యాసాగర్, తెలంగాణ స్కిల్స్ అండ్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారిణి దేవి పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ భూములను పరిరక్షించాలి**

సదాశివపే ట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, కబ్జాకు గురికాకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీశైలం, వీరేశం, శ్రీనివాస్, శ్రీకాంత్, భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

◆ **బీరప్ప జాతర ప్రారంభం**

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామంలో గురువారం బీరప్ప జాతర ఘనంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా బీరప్పస్వామికి ఘనంగా పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.


◆ **డంపింగ్‌యార్డులో వేబ్రిడ్జి ప్రారంభం**

జహీరాబాద్: డంపింగ్ యార్డులో ఏర్పాట్లు చేసిన వేబ్రిడ్జిని మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో లభ్యమయ్యే చెత్త నుంచి ఎరువును పొందాక మిగిలిన మెటీరియల్‌ను విక్రయించేందుకు ఏజెన్సీకి అప్పగించినట్లు తెలిపారు. మెటీరియల్‌ను తూకం వేసేందుకు వీలుగా ఏజెన్సీ వారు వేబ్రిడ్జిని ఏర్పాటు చేసుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రవీందర్**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పర్సా శ్యాంరావు ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంరావు మాట్లాడుతూ ఇంతకాలం తనకు సహకరించిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్లు పావని, సరిత, మాజీ ఉపసర్పంచ్ వాజీద్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా బ్రహ్మోత్సవాలు**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర దేవాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర మూలమంత్ర హోమం, సువర్చన హోమం, సుందరకాండ హోమం నిర్వహించారు.

◆ **రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన**

నారాయణఖేడ్: నిజాంపేట్ వద్ద హైదరాబాద్–అకోలా 161 జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్యూబ్ ఐఎంఎస్ మోహన్ బృందం, సర్పంచ్ జగన్‌చారి మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రయాణం చేసే వాహనాల చోదకులు అవగాహనతో ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజీబాయి రాంచందర్, వార్డుసభ్యులు నర్సింహులు, రజాక్, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం ఎనక్‌పల్లి గ్రామానికి చెందిన జైపాల్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును నారాయణఖేడ్‌లోని తన నివాసంలో గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి జైపాల్‌కు చెక్కును అందజేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాగల్‌గిద్ద పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

◆ **పూర్వబాల్య సంరక్షణ దినోత్సవం**

కొండాపూర్(సంగారెడ్డి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు చదువుతో పాటు ఆటపాటలు, సంస్కృతి, సాంప్రదాయాలు నేర్పిస్తున్నామని సీడీపీఓ రేణుక పట్టేటి అన్నారు. గురువారం మండల పరిధిలోని అనంతసాగర్, హరిదాస్‌పూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వబాల్య సంరక్షణ, విద్యా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హరిదాస్‌పూర్ సర్పంచ్ షఫీ, ఉపసర్పంచ్ ఇంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రమీల పాల్గొన్నారు.

◆ **సుశీల్‌బాబు మృతికి సంతాపం**

సంగారెడ్డి మున్సిపాలిటీ: టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సుశీల్ బాబు గుండెపోటుతో మరణించడంతో గురువారం ఆయన అంత్యక్రియలు జిల్లా కేంద్రం సంగారెడ్డిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ కమర్షియల్ టాక్స్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బంగాలి వెంకటయ్య, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబి కృష్ణ, టీఎన్జీఓ రాష్ట్ర నాయకులు రాజేందర్, రాయగంటి ప్రతాప్, జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుసేని, తదితరులు సంతాపం వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

◆ **రేపు మణవాళన్ గురుస్వామి సంస్మరణ సభ**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈనెల 29వ తేదీన బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం అన్నపూర్ణ అన్నదాన మండపంలో గోవిందరాజ మణవాళన్ గురుస్వామి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్టు అయ్యప్ప పూజ సమితి నిర్వహకులు గురువారం పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు సంస్మరణ సభ ప్రారంభమవుతుందన్నారు.

◆ **కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు**

కొండాపూర్(సంగారెడ్డి): ఓపెన్ స్కూల్‌కు సంబంధించి పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు మూడవ రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పదవ తరగతి అభ్యాసకులకు ఉర్దూ, ఇంటర్మీడియట్ అభ్యాసకులకు కెమిస్ట్రీ, పొలిటికల్ సైన్స్ పరీక్ష నిర్వహించగా మధ్యాహ్నం పదవ తరగతి అభ్యాసకులకు హిందీ పరీక్ష నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలకు 471 మంది అభ్యాపకులకు 420 మంది హాజరు కాగా 51 మంది అభ్యాసకులు గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఇంటర్మీడియట్‌లో 3123 మంది అభ్యాసకులకు 2836 మంది హాజరు కాగా 288 మంది అభ్యాసకులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు పదవ తరగతి అభ్యాసకులు 249 మందికి 222 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన పదవ తరగతి పరీక్షలకు 89 హాజరు శాతం నమోదు కాగా ఇంటర్మీడియట్‌లో 91 హాజరు శాతం నమోదైంది. మధ్యాహ్నం నిర్వహించిన పదవ తరగతి పరీక్షలకు 89 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

◆ **నేడు బసవ భవన్ నిర్మాణానికి భూమిపూజ**



ఝరాసంగం(జహీరాబాద్): ఈ నెల 28న కంది మండల పరిధిలోని కాశిపూర్ గ్రామంలో బసవ భవన్ నిర్మాణ భూమిపూజకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని వీరశైవ లింగాయత్ సమాజ్ ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని కప్పాడ్ గ్రామంలో సభ్యులకు ఆహ్వానపత్రికను అందజేశారు. మంత్రి హరీశ్‌రావు హాజరై భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువత జిల్లా సోషల్‌మీడియా కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, తాలుకా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, నాయకులు భానుపటేల్, రమేష్ పటేల్, నరేష్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం**

సంగారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాది గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షులు చింతల సాయన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డ్‌మెంబర్లు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **23వ రోజుకు నిరసనలు**

హత్నూర(సంగారెడ్డి): కాలుష్య కారక పరిశ్రమ పనులు నిలిపివేయాలని కోరుతూ హత్నూర మండలం వడ్డేపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు చేపట్టిన నిరసనలు గురువారంతో 23వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పరిశ్రమ పనులను నిలిపివేసేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మచ్చ శశికళ వాసుదేవరావు, సర్పంచ్ స్వరూప, ఉపసర్పంచ్ సురేష్ గౌడ్ తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ రావు పాల్గొన్నారు.